క్లుప్తంగా

గురుకులంలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ నిహారిక, స్వరూప,గిరిజ, కల్పన తదితరులు ఉన్నారు.

సాఠే అడుగుజాడల్లో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న సాఠే అడుగుజాడల్లో నడవాలని అన్నాభావు సాఠే క్రాంతి సేనాఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తం బాలేరావ్ అన్నారు. శనివారం మండలంలోని ఝరి(బి)లో అన్నాభావు సాఠే 104వ జయంతి నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సాఠే విగ్రహానికి నివాళులర్పించి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణపతి, చిలింకర్ గంగాధర్, మేకల దేవిదాస్, బాబన్న, లక్ష్మీబాయి, బాలాజీపటేల్, సాయినాథ్, మనోహర్, గంగాధర్, రాజు, సాయినాథ్, రుషికేశ్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

రేపు భూసార్‌బీట్ బంద్

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం భూసార్ బీట్ బంద్ ఉంటుందని ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పురియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న ఆదివారం, 26న కృష్ణాష్టమి సందర్భంగా కార్యాలయానికి సెలవు ఉంటుందని.. దీంతో రెండురోజుల పాటు తాత్కాలికంగా బీట్ బంద్ ఉంటుందన్నారు. రైతులు, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు గమనించాలని సూచించారు. మంగళవారం బీట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

వైకుంఠరథం అందజేత



దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వర్దినేని శ్రీధర్‌రావు తన తల్లిదండ్రులు కూచేశ్వర్‌రావు-వెంకటమ్మ జ్ఞాపకార్థం గ్రామానికి వైకుంఠరథం విరాళంగా అందజేశారు. రూ.50వేలతో తయారు చేయించి గ్రామానికి అందించిన శ్రీధర్‌రావు-రజని దంపతులను శని వా రం వీడీసీ ఆధ్వర్యంలో సత్కరించారు. వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి'

భైంసాటౌన్: సర్కారు బడుల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకానికి ప్రభుత్వం నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ డిమాండ్ చేశారు. శనివారం భైంసాలో మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం ఏటా నిధులు తగ్గిస్తుండడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు.


కరుణించు స్వర్ణమ్మా..



నది వద్ద కాలనీవాసులు

నిర్మల్: మూడేళ్లుగా తమ కాలనీని ముంచెత్తుతున్న స్వర్ణమ్మ ఈసారి కరుణించి తమను చల్లంగా చూసుకోవాలని నిర్మల్‌లోని జీఎస్ఆర్ కాలనీవాసులు మొక్కుకున్నారు. శుక్రవారం తమ కాలనీ పక్కనే ఉన్న స్వర్ణనదిలో నైవేద్యాలతో తెప్ప వదిలిపెట్టారు. 2021నుంచి కాలనీ ముంపునకు గురవుతోంది. ఈసారి ఎలాంటి ఆపద రాకుండా కాపాడాలని స్వర్ణమ్మకు ఇలా మొక్కు తీర్చుకున్నారు.

పాఠశాలలో బీరు సీసాలు..



ఆవరణలో మద్యం సీసాలు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలో మద్యం సేవించి ఖాళీ సీసాలను అక్కడే వదిలేశారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సీసాలను చూసి గ్రామస్తులు, అధికారులకు సమాచారమిచ్చారు. బడిలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముందస్తు కృష్ణాష్టమి



నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఓ పాఠశాలలో కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో పిల్లలు



సోన్ మండలం కడ్తాల్ ప్రాథమిక పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



బాసర: కిర్గుల్(బి)లో కృష్ణుడికి వెన్న తినిపిస్తున్న గోపిక



ఖానాపూర్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారి



మామడ: దిమ్మదుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో..



భైంసాలోని ఓ పాఠశాలలో..



లోకేశ్వరంలోని ఓ పాఠశాలలో..



సారంగపూర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం సెలవుదినం కావడంతో వేడుకలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. చిన్నికృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమాలు, చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. నిర్మల్‌లోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. డిజిటల్ యుగంలో నైతిక విలువలు మర్చిపోయి బంధుత్వాలను దూరం చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు కృష్ణుడి చరిత్ర తెలియజేసేందుకు ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కుంటాల మండలం కల్లూర్‌లో..



లక్ష్మణచాందలోని ఓ పాఠశాలలో..



నర్సాపూర్(జి)లో..



నిర్మల్‌టౌన్: ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో..



దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లో..

వంటగదుల్లేక తంటా..!

- సర్కారుబడుల్లో నిలిచిన నిర్మాణం
- మధ్యాహ్న భోజనం వండేందుకు ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

మండలంలో మొత్తం పాఠశాలలు	43
ప్రాథమిక పాఠశాలలు	33
ప్రాథమికోన్నత పాఠశాలలు	02
ఉన్నత పాఠశాలలు	08
వంట గదులున్నవి	20
వంటగదులు లేనివి	23



బోరిగాం జెడ్పీ పాఠశాలలో నీటి సౌకర్యం లేక గ్రామంలోని కుళాయి వద్ద ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు

తానూరు: విద్యార్థుల ఆకలి తీర్చడంతోపాటు సర్కారుబడుల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కానీ ఆయా పాఠశాలల్లో వంటగదులు, సౌకర్యాలు లేకపోవడంతో భోజనం వండేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరండాలో, మైదానంలో, చెట్లకింద, ఇళ్లల్లో వంట వండి విద్యార్థులకు అందిస్తున్నారు. కొన్ని చోట్ల వంటగ్యాస్ కనెక్షన్ లేక ఆరుబయట కట్టెలపొయ్యిపైనే వంట చేయాల్సిన దుస్థితి నెలకొంది.

తానూరు మండలంలో..

తానూరు మండలంలోని 31 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 43 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఉమ్రి(కే), తానూరు, బామ్ని, కోలూరుతండా, కోలూరు, మొగ్లి గ్రామాల్లోని పాఠశాలల్లో వంటగదులు లేకపోవడంతో నిర్వాహకులు వరండాలో భోజనం వండుతూ విద్యార్థులకు అందిస్తున్నారు. కల్యాణి, ఎల్వత్ గ్రామాల్లో వంటగదులు లేకపోవడంతో నిర్వాహకులు ఇళ్ల వద్ద వంట చేసి మధ్యాహ్న భోజనాన్ని పాఠశాలకు తీసుకొస్తున్నారు.



తానూరు జెడ్పీ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదిలో వంట చేస్తున్న నిర్వాహకురాలు

అసంపూర్తిగా గదుల నిర్మాణం..

మండలంలోని ఉమ్రి(కే), తానూరు తెలుగు ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలు, హిప్నెల్లిలో వంటగదుల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరేళ్ల కిందట ఉపాధిహామీ పథకంలో భాగంగా 13 పాఠశాలకు వంటగదులు మంజూరవగా వాటిల్లో 10 మాత్రమే పూర్తయ్యాయి. బోరిగాం, బెంబర, హిప్నెల్లితండా, హిప్నెల్లి, ఝరి(బి), ఖర్బాలా, ఎల్విలో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాల, దాగాం, జౌలా(కే) గ్రామాల్లోని పాఠశాలల్లో వంటగదులు నిర్మించారు. మరో మూడు గ్రామాల్లో పనులు ప్రారంభించి వదిలేసినట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు.



ఎల్వత్‌లో పాఠశాలలో వంటగది లేక ఇంటి వద్ద అన్నం వండుతున్న నిర్వాహకురాలు

భోజనం అనంతరం శుభ్రం చేసిన వంటపాత్రలను తరగతి గదుల్లో ఉంచుతున్నారు. గదులు ఇరుకుగా మారి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

నీటి సరఫరా లేక ...

హిప్నెల్లితండా, బోరిగాం జిల్లా పరిషత్ పాఠశాల, ఝరి(బి)తండా, ఎల్వత్ గ్రామాల్లో తాగునీటి వసతి లేక విద్యార్థులు, నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. బోరిగాంలో బోరులో నీరు అడుగంటడంతో విద్యార్థులు తిన్న తర్వాత గ్రామంలోని కుళాయిల వద్దకు వెళ్లి ప్లేట్లు కడుగుతున్నారు. గతంలో భగీరథ పథకం ద్వారా ప్రతి పాఠశాలకు నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసిన అధికారులు నీటిని సరఫరా చేయడం మాత్రం మరిచారు.

ఇబ్బంది పడుతున్నాం



వంట గది లేక పాఠశాల వరండాలో మధ్యాహ్న భోజనం వండుతున్నాం. వర్షం కురిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకో వంట గది నిర్మించి సమస్య పరిష్కరించాలి. - భారత్‌బాయి, నిర్వాహకురాలు, తానూరు ప్రాథమిక పాఠశాల

పాతభవనంలో వండుతున్నాం



జిల్లా పరిషత్ పాఠశాలకు వంటగది లేక మధ్యాహ్న భోజనం వండేందుకు ఇబ్బంది పడుతున్నాం. పాత భవనంలో వంట చేస్తున్నాం. అధికారులు పాఠశాలలో వంటగది నిర్మించి సమస్య పరిష్కరించాలి. - సవితాబాయి, నిర్వాహకురాలు, తానూరు జెడ్పీ పాఠశాల

సమస్యలు పరిష్కరిస్తాం

ఉపాధిహామీ పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన వంటగదుల నిర్మాణాలను పరిశీలించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం. వంట గది లేని పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు పంపుతాం. వంట గదులకు నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించేలా చూస్తాం. - అబ్దుల్ సమద్, ఎంపీడీవో

నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి ఎంఈఓ మధుసూదన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీబీవీలో నైట్ వాచ్‌ఉమెన్-1 (ఎస్టీ జనరల్), స్కావెంజర్-1 (ఎస్సీ జనరల్)పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అర్హులు ఈనెల 31లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ కేజీబీవీలో బోధనేతర సిబ్బంది నియామకం కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంఈవో మధుసూదన్ తెలిపారు. రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులకు (బీసీ-ఏ జనరల్), (ఎస్టీ ఉమెన్) అర్హులన్నారు. స్కావెంజర్ ఉద్యోగానికి ఎస్టీ జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 31 లోగా స్థానిక ఎమ్మార్సీలో బయోడేటాతోపాటు గెజిటెడ్ అధికారి అటెస్టేషన్‌తో ధ్రువపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐదు నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో కస్తూరి శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్‌కుక్-1 (ఓసీ జనరల్), అసిస్టెంట్ కుక్ -4 (ఓసీ జనరల్, ఎస్టీ జనరల్, ఓసీ ఉమెన్, బీసీ(బీ) జనరల్ కేటగిరిల వారు అర్హులని పేర్కొన్నారు. హెడ్‌కుక్ పోస్టుకు పదోతరగతి, అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి చదివిన మహిళలు ఈనెల 31 లోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో ఉన్న కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్, అటెండర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంఈఓ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్ పోస్టుకు బీసీ-బీ, కుక్ పోస్టుకు బీసీ-డీ మహిళా అభ్యర్థులు అర్హులని.. ఆసక్తి, అర్హత కల్గినవారు ఈనెల 31లోగా తమ బయోడేటా, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన దరఖాస్తు ఫారంతో ఎమ్మార్సీలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చెత్తాచెదారం తొలగించాలి



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సుదర్శన్

భైంసారూరల్: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలని డీఎల్‌పీఓ సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలను శుభ్రం చేసి క్లోరినేషన్ నీటిని ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యదర్శి ప్రియాంక, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లూరు కేజీబీవీ, కుంటాల పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శులు భోజన్న, రాజబాపు, టీఏలు మాధురి, జైసింగ్, ఎఫ్ఏలు రాందాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నాలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



నాలాను పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

ముధోల్: నిబంధనలకు వి రుద్ధంగా నాలాలు ఆక్రమణ లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో విజ యలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ జీ ఎ స్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ సమీపంలో ఆక్రమణకు గురైన ఖజానా చెరువు, చెరువు నుంచి నీరు పోయే కాలువను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో శివ, ఏపీవో శిరీష, రెవెన్యూ, ఈజీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

ముధోల్: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం గ్రామస్తులు ఎంపీడీవో శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ముధోల్‌లోని ప్రధాన రోడ్డు, అంతర్గత రోడ్లు వర్షాలకు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి మహాలక్ష్మీ గల్లి హనుమాన్ ఆలయం వరకు, శివాజీచౌక్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ పంపు వరకు, సాయిమాధవ్ నగర్ వెళ్లే రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసి వాహనదారుల కష్టాలు తీర్చాలని కోరారు. ఏఈవో శిరీష, మాజీసర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, గంగాధర్, వాగ్మారే పవన్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

సరుకులు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని దుర్గానగర్ తండాలో రాళ్లను కొట్టుకుంటూ జీవనం సాగించే పేద కుటుంబానికి చెందిన లక్ష్మి శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. శనివారం ఎస్సై అశోక్.. బాధిత కుటుంబసభ్యులకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను విరాళంగా అందజేశారు. బలీరాం, భోజన్న, లస్మన్న, శాంతబాయి ఉన్నారు.

నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన

మామడ: మండలంలోని పొన్కల్ నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సదర్మాట్ బ్యారేజీతో ఆలయం ముంపునకు గురవుతుండటంతో సమీపంలో తాత్కాలికంగా ఆలయం ఏర్పాటు చేశారు. అచులాపూర్ వేద పాఠశాల పండితులు ధీరజ్‌శర్మ, సునీల్‌శర్మ, శ్రవణ్ కుమార్ జోషి, అజయ్ వేదమంత్రోచ్ఛరణల నడుమ హోమం, ప్రత్యేక పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అర్చకుడు రవి, ఆలయ కమిటీ చైర్మన్ కాలగిరి గంగయ్య, వీడీసీ చైర్మన్ కొరిపెల్లి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ చొరవతో తీరిన నీటి సమస్య

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలో వర్షపు నీరు నిలువడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు. కౌన్సిలర్ పరిమి లతసురేశ్ సొంత ఖర్చులతో ఎల్‌టీ మిషన్ తెప్పించి మున్సిపల్ సిబ్బందితో రోడ్లపై నిలిచిన నీటిని మళ్లించారు. అనంతరం కమిషనర్ మనోహర్ ఓపెన్ ప్లాట్లలో దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్ వేయించారు.

ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలి

నర్సాపూర్(జి): ఎల్ఆర్ఎస్-2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న ప్లాట్లను శనివారం రెవెన్యూ, పంచాయతీరాజ్, నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని నసీరాబాద్ శివారులోని ప్లాట్లకు కొలతలు వేసి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, నీటిపారుదలశాఖ ఏఈ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

'ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం'

నిర్మల్‌టౌన్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. కురుస్తున్న వర్షానికి జిల్లా కేంద్రంలోని 33వ వార్డు పరిధి రాధాకృష్ణ మందిరం వీధిలో మురుగు నీటి నాలాల్లో చెత్తాచెదారం చేరి, నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ శనివారం ఆ ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య సిబ్బందితో మురుగు నీటి నాలాలను శుభ్రం చేయించారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పొన్కల్‌లో వైద్యశిబిరం

మామడ: మండలంలోని పొన్కల్‌లో శనివారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడే వారి రక్తనమూనాలు సేకరించి మందులు అందించారు. వైద్యసిబ్బంది స్వరూప, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్‌రోడ్‌లో ఉన్న గీతానగర్‌లోని ఓ ఇంట్లో శనివారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీలో నివాసముంటున్న అరవింద్ ఇంట్లో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలార్పివేశారు. ఇంట్లోని టీవీ, కూలర్ కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామ మాజీ సర్పంచ్ బాపురావ్ అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం బాధిత కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ పరామర్శించారు. వారి వెంట రాంచందర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.